మల్లన్న గెలుపునకు కృషిచేయాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్



మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న, పక్కన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దేవరకొండ : వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు గెలుపునకు కృషి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పిలుపునిచ్చారు.గురువారం దేవరకొండ పట్టణంలోని పీపీఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు అత్యంత కీలకమైనవని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పట్టభద్రులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ప్రశ్నించే గొంతుకైన తనను ఆశీర్వదించి ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉద్యోగులు,నిరుద్యోగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, గుత్తా అమిత్‌రెడ్డి, పల్లా నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాన్, జాల నర్సింహారెడ్డి, రేఖారెడ్డి, వంగాల ప్రతాప్‌రెడ్డి, జూలూరి ధనలక్ష్మీ, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, నరసింహా, రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రజా గొంతుకనవుతా

మిర్యాలగూడ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించి పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. గురువారం స్థానిక ఎస్పీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తానంటూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గతంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి ప్రజలను, సమస్యలను విస్మరించి ఎమ్మెల్యేగా పోటీ చేశాడన్నారు. ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధికంగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, అర్జున్, బెజ్జం సాయి పాల్గొన్నారు.

సాయి దేవాలయంలో మల్లన్న పూజలు

చింతపల్లి : మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, యాదగిరి, సదానందం, శ్రీనివాస్, గోవిందు రవి, సలీమ్ పాల్గొన్నారు.



చింతపల్లి : సాయినాథుడి దేవాలయంలో పూజలు చేస్తున్న తీన్మార్ మల్లన్న

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు



మిర్యాలగూడ : ఇసుక డంప్‌లను సీజ్ చేసి మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ : ప్రభుత్వ అనుమతి లేకుండా చెరువులు, కుంటలు, వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలించినా నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ శివారులో అక్రమార్కులు నిల్వ చేసిన సుమారు 8–10 డంప్‌ల ఇసుక(160 ట్రిప్పులు)ను జిల్లా మైనింగ్ ఏడీ జాకబ్‌తో కలిసి దాడులు చేసి సీజ్ చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలించినా, డంప్ చేసినా వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. వారి వెంట తహసీల్దార్ హరిబాబు, రూరల్ ఎస్‌ఐ నరేష్, ఆర్‌ఐలు సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

మిర్యాలగూడ : ఈనెల 27న జరగనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా 28 పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాడ్గులపల్లి –2, వేములపల్లి–1, మిర్యాలగూడ –13, దామరచర్ల–2, అడవిదేవులపల్లి– 1, నిడమనూరు –2, త్రిపురారం –2, తిరుమలగిరి(సాగర్)–2, హాలియా –2, పెద్దవూర–2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15,768 మంది పురుష ఓటర్లు, 8,443 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. ఈనెల 27న నిర్వహించే పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు

హుజూర్‌నగర్ : దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ రంగ ప్రోత్సాహంతో దేశంలో 5కోట్ల ఉద్యోగాలు పోయాయని, యువతకు ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, పోకల వెంకటేశ్వర్లు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం



సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రైల్వే కాలనీలోని శ్రీసాయి దత్తాశ్రమంలో గురువారం నాగసాయి విగ్రహా ప్రతిష్ఠాపన వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుఝామున పంచామృతాభిషేకాలతో పాటు పలు రకాల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన కార్యదర్శి నరేందర్ ఆధ్వర్యంలో 25కిలోల పూలతో సాయినాథుడికి అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రోత్సవాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో అంగరంగ వైభవంగా వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, నరేందర్, మట్టయ్య, సోమయ్య, పందిరి సత్యనారాయణ, జగన్నాథరావు, జానకిరాముడు, రవి కిరణ్, విక్రం, వెంకన్న, అంజిబాబు, అరుణ, భాగ్యలక్ష్మి, పద్మ, కళ్యాణి, భవాని, శారద తదితరులున్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

హాలియా : రాష్ట్ర రైతాంగాన్ని మారోసారి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో హాలియా పట్టణంలో నేతలు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు సన్న రకం వడ్లకు మాత్రమే అనడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, తిరుమలగిరి మండల అధ్యక్షుడు నాగయ్య, జిల్లా మున్సిపల్ కౌన్సిలర్ సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు బీవీ రమణరాజు, నల్లగొండ సుధాకర్, సురభి రాంబాబు, మహిళా అధ్యక్షురాలు గడ్డం రమణ, సీకేయూత్ అధ్యక్షుడు బండి రమేష్, మద్దిమడుగు మార్క్, కృష్ణ కాశయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

దేవరకొండ : రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు గురువారం పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రైతులను వంచించడమేనన్నారు. ఓట్లు డబ్బాలో పడగానే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరిందన్నారు. రైతుబంధు, రైతు భరోసా ఇవ్వకుండా తెలంగాణ రైతాంగాన్ని అన్ని రకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేగెట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, మాధవరం సునీతాజనార్దన్, చింతపల్లి సుభాష్, చంద్రశేఖర్‌రెడ్డి, వల్లపురెడ్డి, దస్రు నాయక్, గాజుల ఆంజనేయు లు, లోకసాని తిరుపతయ్య, నట్వ గిరిధర్, కేసాని లింగారెడ్డి పాల్గొన్నారు.

అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి

మిర్యాలగూడ : రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయ సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో రూ.2లక్షల రుణమాఫీ, రైతు బంధు రూ.15వేలకు పెంపు, వరి ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి వానాకాలం నాటికి సన్నరకం ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు.ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఆంగోతు లలిత హాతీరాంనాయక్, పెండ్యాల పద్మ, అమరావతి సైదులు, చిట్టిబాబునాయక్, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మోసిన్‌అలీ, బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, కరీం పాల్గొన్నారు.



మిర్యాలగూడ : గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు.



నాగార్జున సాగర్ : పరేడ్ గ్రౌండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు



మిర్యాలగూడ : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయ సింహారెడ్డి

ప్రజా వ్యతిరేక విధానాలను సహించం

నాగార్జునసాగర్ : రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక బీఆర్ఎస్ నేతలు గురువారం నిరసన తెలిపారు.రైతులు పండించిన వరి ధాన్యంను కొనుగోలు చేయకుండా సన్నబియ్యానికి సబ్సిడీ ఇస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోట్ల సైదులు, లక్ష్మణ్‌నాయక్, చంద్రమౌళి, మందాశాంతకుమారి, సల్లోజు శేఖరాచారి, సయ్యద్‌గౌస్ మహేష్, ఏడుకొండలు, నజీర్ పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డిని మండలికి పంపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

దేవరకొండ : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించి శాసన మండలికి పంపించాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కోరారు. గురువారం దేవరకొండ పట్టణంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు లక్షల ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేయాలంటే రాకేశ్‌రెడ్డి లాంటి నాయకుడు శాసనమండలికి ఎన్నిక కావాలన్నారు. ఈ సమావేశంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, ఎంపీపీ మాధవరం సునీత, చింతపల్లి సుభాష్, చంద్రశేఖర్‌రెడ్డి, వెలుగూరి వల్లపురెడ్డి, గాజుల ఆంజనేయులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

మిర్యాలగూడ : 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా బీసీలకు 23 శాతం నుంచి 42 శాతానికి రిజర్వేషన్లను పెంచిన తర్వాతే సర్పంచ్ ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడారు. గత ప్రభుత్వాలు బీసీలకు స్థానిక సంస్థల్లో ఉన్న ఎన్నికల రిజర్వేషన్లను తగ్గించడం వల్ల ఆ ప్రభుత్వాలను బీసీలు సాగనంపాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడులో మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు

మాడుగులపల్లి : మండలంలోని పాములపహాడ్ గ్రామంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో ఇమాన్యుయేల్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యులు రక్త పరీక్ష, బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. కంటి చూపు సమస్యలున్న వారికి కళ్లద్దాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు జితేంద్ర, ప్రమోద్, సంధ్యారాణి, మనోజ్ఞ, వికాస్, నిర్వాహకులు జంగా, జయరాజ్, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పెద్దవూర : నల్లగొండ నుంచి రెండు లారీల్లో పెద్దవూర గోదాముకు రేషన్ బియ్యం తీసుకువస్తుండగా వాటిని గోదాముకు తరలించకుండా మధ్యలోనే రైస్‌మిల్లుకు పంపిస్తున్నారన్న సమాచారంతో గురువారం నల్లగొండ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పెద్దవూర, హాలియా పోలీసులు లారీలను వెంబడించి పట్టుకున్నట్లు తెలిసింది. అధికారులు ఆ లారీలను పట్టుకుని విచారించినట్లు తెలిసింది. కాగా ఈవిషయమై పోలీసులను సంప్రదించగా వారు ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పాండురంగారెడ్డి



ఆర్థిక సాయం అందజేస్తున్న మన్నె రంజిత్ యువసేనా సభ్యుల

హాలియా : అనుముల మండలంలోని పాలెం గ్రామానికి చెందిన నర్సింగ్ గిరి ఇవటీల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యువ సేనా సభ్యుల ఆధ్వర్యంలో గురువారం బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి తల్లి సైదమ్మను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, తిరుమలనాథ గుడి మాజీ చైర్మన్ బుర్రి రాంరెడ్డి, కుస్‌రెడ్డి సంతోష్‌రెడ్డి, గడ్డం సజ్జన్, అబ్దుల్ కరీం, ఇస్రం లింగస్వామి, గజ్జల శివానందరెడ్డి, రమేష్‌చారి, నాగార్జున రెడ్డి, రామకృష్ణారెడ్డి, రంజిత్ యువసేనా సభ్యులు కాట్నం సతీష్ గౌడ్, బాస్కర్, కాట్నం నాగరాజు, లింగయ్య, సైదులుబాబు, కొండల్, శివ, వినోద్, బ్రహ్మచారి. శేఖర్, మామిడి జానయ్య, కాట్నం శేఖర్, క్రాంతి, సురేష్ ఉన్నారు.

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన దేవరకొండ శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా విషయం తెలుసుకున్న గ్రామ అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా గ్రామ మాజీ సర్పంచ్ నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి బాధితుడు శ్రీనుకు రూ.6వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు రెమడాల సతీష్, వల్లమల్ల పరమేష్, పుట్టల మాదేష్, ఈట నాగరాజు, జెర్రిపోతుల తిరుమలేష్, దశరథ్, సురేందర్, ప్రవీణ్, సతీష్, వెంకట్, శంకర్ పాల్గొన్నారు.



వేములపల్లి : శ్రీనుకు ఆర్థిక సాయం అందజేస్తున్న అంబేద్కర్ యూత్ సభ్యులు

'మార్గం' సుగమం !



మాడ్గులపల్లి మండలంలోని చెరువుపల్లి- కేశవాపురం గ్రామాల మధ్య వాగుపై నిర్మించిన లోలెవల్ వంతెన

మాడుగులపల్లి : మాడుగులపల్లి మండలం చెరువుపల్లి– కేశవాపురం మధ్య వాగుపై లోలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యింది. దీంతో వర్షాకాలంలోనూ పలు గ్రామాలకు వాహనాల రాకపోకలకు మార్గం సుగమమైంది. వానాకాలంలో వాగుకు వరద వస్తే కన్నెకల్లు, మాచినపల్లి, నారాయణపురం, గార్లకుంటపాలెం గ్రామాల ప్రజలు చెరువుపల్లి మీదుగా మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఇబ్బందిపడేవారు. వాగు అవతలివైపు పొలాలు ఉన్న రైతులు ప్రత్యామ్నాయ మార్గాల గుండా వెళ్లేవారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీ మేరకు అప్పటి ఎమ్మెల్యే నోముల భగత్ చొరవ తీసుకొని బ్రిడ్జి నిర్మాణానికి పంచాయతీ రాజ్ నిధులు రూ. 9 లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రయాణికులు, వాహనదారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డెంగీ వ్యాధి నివారణపై అవగాహన

నల్లగొండ టౌన్ : జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం పానగల్‌లో డెంగీ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కూలర్లు, పాతకుండలు, తొట్లు, మురుగునీటి గుంటల్లో నీరు నిల్వ ఉండకుండా పారబోయాలన్నారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బైరగోని భిక్షం, సురేష్, ఏఎన్ఎం నర్సమ్మ, శిరీష, మంజుల అనురాధ, రేణు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

డిండి ప్రాజెక్టులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

డిండి: మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టులో గురువారం గుర్తుతెలియని మహిళ మృతదేహం (సుమారు 50 ఏళ్లు) లభ్యమైనట్లు ఎస్ఐ రాజు తెలిపారు. గుర్తుతెలియని మహిళ మృతదేహం డిండి ప్రాజెక్టు నీటిలో తేలియాడుతున్నట్లు మత్స్యకారులిచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. డిండి గ్రామ పంచాయతీ సెక్రటరీ జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వివరించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 8712670155ను సంప్రదించాలన్నారు.

బస్టాండ్‌లో అన్ని సమస్యలే!



ఆర్టీసీ బస్టాండ్‌లో మరమ్మతులకు గురైన తాగునీటి ఫ్రిడ్జ్



తాళం వేసి ఉన్న మూత్రశాలలు

- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- లీక్ అవుతున్న మరుగుదొడ్డి పైప్‌లైన్
- కంపుకొడుతున్న బస్టాండ్ ఆవరణ

కొండమల్లేపల్లి : హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ఉన్న కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండు నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రయాణీకులతో కిటకిటలాడే కొండమల్లేపల్లి ఆర్టీసీకి అదే స్థాయిలో ఆదాయం ఉన్నా. ప్రయాణీకులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసి అధికారులు చేతులెత్తేయడంపై ప్రయాణీకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తిష్టేసిన సమస్యలు

కొండమల్లేపల్లి ఆర్టీసి బస్టాండులో ఓ వైపు లీకేజీ అయిన మరుగుదొడ్డి పైపల్ లైన్ నుంచి భరించలేని దుర్గంధం.. మరో వైపు తాగునీరు లేక వేసవిలో ప్రయాణికులు పడుతున్న అవస్థలు అన్ని ఇన్ని కావు. ప్రయాణికుల సౌకర్యార్థం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన తాగునీటి ఫ్రిడ్జ్ మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మూత్రశాలలు రిపేర్‌లో ఉన్నాయంటూ బోర్డు పెట్టడంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులతో కిటకిటలాడే కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండుకు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా బస్సులు వస్తుంటాయి. రద్దీకి తగ్గట్టే లక్షల్లో ఆదాయం ఉన్నా కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నా ఆ దిశగా ఆర్టీసీ అధికారులు కనీసం చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైన సంబంధిత డిపో మేనేజర్ స్పందించి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గం అండ్ రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించగా అసోసియేషన్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా జాన్ సుందర్‌రాజు, అధ్యక్షుడిగా ఎంవీ శేషయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గిద్యోన్, జనరల్ సెక్రటరీగా ప్రభుదాస్, ట్రెజరరీగా బాలస్వామి, రూరల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉబ్బాని రవి, ఉపాధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఈఎస్ నాయక్, చీఫ్ సలహదారులుగా ముండ్లగిరి కాంతయ్య, సంపత్, విజయరాణి, ఫిబాలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం పాస్టర్లు అనంద్‌పాల్, అబ్రహం, శంకర్‌నాయక్, సుధాకర్, ఏసుమణి, సైదానాయక్, యోహాన్, అనిల్, జాషువా, రాజేశ్వర్‌రావు తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి తరగతులను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని యాద్గార్‌పల్లిలో ఈనెల 24, 25వ తేదీల్లో నిర్వహించనున్న ఎంసీపీఐయూ రాష్ట్ర తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు వస్కుల మట్టయ్య అన్నారు. గురువారం నిర్వహించిన జిల్లా పార్టీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకు సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శిగా పోతుగంటి కాశి నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరికుప్పల వెంకన్న, సూర్యాపేట జిల్లా కార్యదర్శి ఎస్‌కె.నజీర్, వసుకుల సైదమ్మ, చంద్రకళ, కిరణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో బోరు ఏర్పాటు



బోరు ఏర్పాటు చేయిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్

చింతపల్లి : మండల పరిధిలోని కుర్రంపల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి పరిష్కరించేందుకు గ్రామ మాజీ సర్పంచ్ బొడ్డు శ్రీను తన సొంత ఖర్చులతో గురువారం బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు సొంత ఖర్చులతో బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేస్తానన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న వీరయ్య, క్లబ్ సభ్యులు

దేవరకొండ : పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ మిత్ర సభ్యులు రావిరాల వీరయ్య దంపతుల 53వ వివాహ వార్షికోత్సం సందర్భంగా పట్టణంలోని వృద్ధాశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రావిరాల వీరయ్య మాట్లాడుతూ పెళ్లి రోజు వేడుకలను వృద్ధాశ్రమంలో జరుపుకోవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర దేవరకొండ ఆధ్వర్యంలో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు అంకం చంద్రమౌళి, కూరెళ్ల కృష్ణాచారి, మాకం మహేశ్, సంధ్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు



మద్దతు తెలుపుతున్న పానుగోటి చొక్కారావు

నల్లగొండ టూటౌన్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ద్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు తెలిపారు. గురువారం బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని కలిసి మద్దతు తెలిపారు. అనంతరం చొక్కారావు మాట్లాడుతూ తాను 33 సంవత్సరాలపాటు విద్య నేర్పిన విద్యార్థులందరూ ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలన్నారు. ఉపాధ్యాయులు, రిటైర్డు ఉద్యోగులు కూడా బీజేపీ అభ్యర్థికి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా.నాగం వర్షిత్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.